
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం 23 సెప్టెంబరు 2025



మేడారానికి కొత్త రూపు

ఆదివాసీల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ కొలువైన మేడారం క్షేత్రంలో చరిత్రాత్మక మార్పులు రాబోతున్నాయి. రెండేళ్లకోసారి కోటి మందిని రప్పించే కోన ఆధునిక రూపును సంతరించుకోనుంది. 'మాస్టర్ ప్లాన్' పేరుతో మేడారాన్ని మరింత సౌలభ్యంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ సిద్ధమైంది. గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు చెదరకుండా గద్దెలను పునర్నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. సమ్మక్క సారలమ్మ గద్దెలతో పాటు పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో ఉండేలా నిర్మాణ ప్రణాళిక రూపొందించారు. మహాజాతర వేళ తల్లుల దర్శనం ప్రశాంతంగా జరిగేలా గద్దెల ప్రాంగణాన్ని విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జంపన్నవాగులో నిరంతరం నీళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీటితో పాటు శాశ్వత అభివృద్ధి పనులను ప్రారంభం, కొత్త పనులకు శంకుస్థాపన, గద్దెల కొత్త రీ డిజైన్‌పై గిరిజనులతో చర్చించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం వస్తున్నారు.

- సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు కొత్త డిజైన్
- ఒకే వరుసలో ఉండేలా నిర్మాణానికి ప్రణాళిక
- గిరిజనుల సంప్రదాయాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు
- గద్దెల సాలహారం నలువైపులా విస్తరణ
- మహాజాతర వేళ ప్రశాంత దర్శనం కోసం ఆధునిక చర్యలు
- జంపన్నవాగులో నిరంతరం నీటిని నిల్వ ఉంచేలా ప్రణాళిక
- శాశ్వత అభివృద్ధి పనులతో జాతరకు గుర్తింపు తెచ్చేలా కసరత్తు
- రూ.150కోట్లతో మేడారం మాస్టర్ ప్లాన్ అమలు
- నేడు మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహాజాతరను ఆధునీకరించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మాస్టర్ ప్లాన్ పేరుతో జాతరలో శాశ్వత అభివృద్ధి పనులతో పాటు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఆధునీకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు ఒక వరుసలో ఉండగా, వీరి ఎదురుగా పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలు ఉన్నాయి. భక్తులు క్యూ లైన్ ద్వారా సమ్మక్క, సారలమ్మ దర్శించుకుని పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్దకు రావటం ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో నాలుగు గద్దెలను ఒకే వరుసలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం గద్దెల చుట్టు ఇనుప (స్టీల్) గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ప్రణాళికలో గద్దెల చుట్టూ గ్రానైట్‌తో నిర్మించాలని ప్లాన్ చేశారు. గద్దెల చుట్టూ గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ చరిత్రతో పాటు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజనుల లిపి, ఇతర జాతర వైభవం తెలియజేసే బొమ్మలను చెక్కనున్నారు. ఈ విషయమై పలుమార్లు గిరిజన పూజారులు, పెద్ద మనుషులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, గిరిజన సంప్రదాయాలు దెబ్బతినకుండా గద్దెల డిజైన్‌ను తయారు చేస్తున్నారు. గిరిజనుల అభిప్రాయాలకు అనుగుణంగా నాలుగైదు విధాలుగా అధికారులు గద్దెల డిజైన్లు రూపొందించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి మేడారంలో పర్యటించనుండటంతో గిరిజనుల అభిప్రాయాల మేరకు ఒక డిజైన్ ఫైనల్ చేసి శంకుస్థాపన చేయనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

గద్దెల సాలారం విస్తరణ..

మహాజాతర వేళ భక్తులకు సమ్మక్క, సారలమ్మ తల్లుల దర్శన భాగ్యం మహా కష్టమవుతోంది. గంటల తరబడి క్యూలో నిలబడితే ఏ తెల్లవారు జామునో.. అర్ధరాత్రో.. తల్లుల దర్శన భాగ్యం లభించదు. గంటల తరబడి తల్లుల దర్శన భాగ్యం కోసం భక్తులు క్యూ కడితే ఐదారు నిమిషాలు కూడా తల్లులను మనసారా మొక్కుకునే అవకాశం కలుగడం లేదని భక్తుల ఆవేదన. ప్రస్తుతం 32 గుంటల స్థలంలో తల్లుల గద్దెల ప్రాంగణం ఉండగా, సమ్మక్క, సారలమ్మ,

(మిగతా 7లో..)



సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు కొత్త డిజైన్

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

- పలు పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



మేడారంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క.

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనుండగా ఏర్పాట్లను అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం మేడారంలో పర్యటించారు. హెలీప్యాడ్, రహదారులు, పార్కింగ్ స్థలాలు, సభా వేదిక, విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించారు. మంత్రి వెంట కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఎస్పీ శబరీశ్, అదనపు ఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి ఉన్నారు. మేడారం పర్యటించనున్న సీఎం రేవంత్‌రెడ్డి 2026 జనవరి 28న నిర్వహించనున్న సమ్మక్క- సారలమ్మ మహాజాతర ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. ముందుగా తల్లులను దర్శించుకొని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. శాశ్వత నిర్మాణ పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను స్లైడ్ షో ద్వారా పూజారులకు వివరించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు. వెయ్యి మంది పోలీస్ సిబ్బందిని ములుగు నుంచి మేడారం, తాడ్వాయి మార్గాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్, సీసీ కెమెరాలు, వాహనాల తనిఖీలతోపాటుగా ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాప్‌లపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సీఎం పర్యటన సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర ఆధ్వర్యంలో ముమ్మరం చేశారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇదీ..

- ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరుతారు.
- 10.45 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి హెలీకాప్టర్ ద్వారా ప్రయాణించి మధ్యాహ్నం 12 గంటలకు మేడారం చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.15 గంటలకు సమ్మక్క-సారలమ్మ గద్దెలను సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తారు.
- అనంతరం పూజారులతో సమావేశమవుతారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. గద్దెల ప్రాంగణంలోని పరిసరాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం ఆలయ పునరాభివృద్ధిపై స్లైడ్ షోను తిలకిస్తారు.
- 1.30 నుంచి 2.30 గంటల వరకు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో వేచి ఉంటారు.
- 2.30 గంటలకు తిరిగి హైదరాబాద్ బయల్దేరుతారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రహదారుల నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసుల పరిష్కార ప్రక్రియను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ రామకృష్ణరావు, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి రామకృష్ణరావుతో కలిసి ముఖ్యమంత్రి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ రహదారుల నిర్మాణంపై సమీక్షించారు.

ఈసందర్భంగా కలెక్టర్లతో ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి కావాలన్నారు. కోర్టు కేసులు ఉన్న భూముల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి భూములను సేకరించాలన్నారు. రహదారుల నిర్మాణం ఆలస్యం కాకుండా ప్రతి కేసునూ అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎలాంటి అలసత్వం వహించొద్దన్నారు.

జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి జాప్యం జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఆర్‌అండ్‌బీ డీఈ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా

భూపాలపల్లి ఏరియాలో 5,200 పర్మనెంట్, 3,200 మంది కాంట్రాక్టు కార్మికులు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ప్రభుత్వం లాభాల వాటా ప్రకటించింది. 34 శాతం ఇవ్వనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో 5,200 మంది సింగరేణి పర్మనెంట్ కార్మికులు ఉండగా, ఓబీ, ఎస్‌టీపీ, గెస్ట్‌హౌజ్, ఎక్స్‌ప్లోరేషన్, బ్లాస్టింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారు కాంట్రాక్ట్ కార్మికులు 3,200 మంది ఉన్నారు. పర్మనెంట్ కార్మికులకు పేస్కేల్ ప్రాతిపదికన 34 శాతం లాభాల వాటా రానుండగా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5,500 చొప్పున ఇవ్వనున్నారు.

ఈ ఏడాది సింగరేణి సంస్థకు ఎంత లాభం వచ్చినా కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాల్సిందేనని ఏఐటీయూసీతో పాటు ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, బీఎంఎస్, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్ ఇతరత్రా సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం మాత్రం 34 శాతాన్ని ఖరారు చేసింది. 2022-23లో 32 శాతం, 2023-24లో 33 శాతం లాభాల వాటాను ఇచ్చారు. 2024-25 సంవత్సరానికి 34 శాతం కేటాయించారు. కాంట్రాక్ట్ కార్మికులకు గతంలో ఎన్నడూలేని విధంగా ఏడాది లాభాల వాటాలో బోనస్ పేరుతో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఇచ్చారు. ఈ బోనస్‌ను ఈసారి పెంచి రూ.10 వేలు అందించాలని పలు యూనియన్ల నాయకుల నుంచి డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో రూ500 పెంపుతో వీరికి రూ. 5,500లను ఇవ్వనున్నారు.



ఆ సంఘాలు లొంగిపోయాయి



కాంగ్రెస్ ప్రభుత్వ మోసంతో కార్మికులు లాభాలు తగ్గాయి. రేవంత్‌రెడ్డికి గుర్తింపు, ప్రాతినిధ్యం సంఘాలు లొంగిపోయాయి. 2024-25కు 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగా సింగరేణికి రూ.6,394 కోట్ల నికర లాభాలు వచ్చాయి. కానీ, ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం చూస్తే ఒక్కో కార్మికుడికి రూ.2 లక్షలు వస్తున్నాయంటే మొత్తం రూ.819 కోట్లను మాత్రమే 34 శాతంగా ప్రకటించారు. కార్మికులు మేల్కొని ఈ సంఘాలను నిలదీయాలి.

\- అప్పాని శ్రీనివాస్, బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

ఆమోద యోగ్యమే..



సింగరేణి కార్మికులకు 35 శాతం లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్ చేశాం. కానీ, 34 శాతమే ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఆమోద యోగ్యమే. గతంలో ఎన్నడూలేని విధంగా లాభాల వాటా ప్రకటించేందుకు ఇంత ఆర్భాటాలు అక్కర్లేదు. కార్మికుల కష్టార్జితమే ఇస్తున్నారు తప్ప ప్రభుత్వ ఖజానా నుంచి కాదు.

\- మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

కాంట్రాక్టు కార్మికులను గుర్తించడం హర్షణీయం



కాంట్రాక్టు కార్మికులను గుర్తించి లాభాల్లో బోనస్ ఇవ్వడం హర్షణీయం. ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. గత ప్రభుత్వం అసలు సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులే లేరని ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం గుర్తించి రూ.5,500 ఇవ్వడం సంతోషకరం.

\- కోల నాగేంద్రబాబు, కాంట్రాక్టు కార్మికుల లేబర్ యూనియన్ అధ్యక్షుడు



మాధవరావు మృతదేహం

తమ్ముడి చేతిలో అన్న హత్య

- గడ్డపారతో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి
- భూ వివాదాలే కారణం

వెంకటాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో సోమవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. భూ వివాదాల నేపథ్యంలో అన్నను తమ్ముడు చంపడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి గ్రామానికి చెందిన గొంది లక్ష్మయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు కుమారుడు మాధవరావు(35), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో భార్యకు సాంబశివరావు ఏకైక సంతానం. మాధవరావు వ్యవసాయ కూలీగాపని చేస్తున్నాడు. సాంబశివరావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తండ్రి లక్ష్మయ్య మృతి చెందడంతో నుంచి వారసత్వంగా ఆరున్నర ఎకరాల భూమి ఉండగా ఇద్దరు అన్నదమ్ములు సమాన వాటాలుగా పంచుకున్నారు. ఈక్రమంలో సాంబశివరావు తనకు సంక్రమించిన భూమిని అమ్ముకునే విషయంలో మాధవరావును సంతకం పెట్టమని అడగ్గా అతను నిరాకరించాడు. భూమి అమ్ముకుంటే జీవనం సాగించడం కష్టంగా మారుతుందని అందుకు అంగీకరించలేదు. దీంతో భూమి అమ్ముకునే విషయంలో మాధవరావు అడ్డుపడుతున్నాడని సాంబశివరావు కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం మాధవరావు ఇంటికి మధ్యాహ్నం సమయంలో వెళ్లిన అతడు భూమి విషయంలో గొడవపడ్డాడు. ఈక్రమంలో మాటామాటా పెరగడంతో ఆవేశానికిలోనైన సాంబశివరావు గడ్డపారతో మాధవరావు తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై మెదడు బయటకు వచ్చి మాధవరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావు సంఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చెల్లెలు కోరం నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడు, నిందితుడు అవివాహితులు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హత్య చేసిన అనంతరం నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

యూరియా బస్తాల పట్టివేత

మహదేవపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా యూరియా బస్తాలను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మహదేవపూర్ నుంచి కాటారం మండలం దామెరకుంటకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న యూరియాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా అతడి వద్ద ఎలాంటి బిల్లులు లభించలేదన్నారు. వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

పిడుగుపాటుతో రైతు మృతి

గాయపడ్డ మరొకరు.. ములుగు జిల్లాలో ఘటన



కృష్ణ మృతదేహం

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో రైతు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చల్పాక గ్రామానికి చెందిన రైతు ఊకె కృష్ణ(45) అదే గ్రామానికి చెందిన పూనెం చిట్టిబాబుతో కలిసి ఉదయం తన మొక్కజొన్న చేనులో దున్నడానికి వెళ్లాడు. సాయంత్రం చేనులో పనులు చేస్తున్న క్రమంలో ఈదురు గాలులు, ఉరుములతో వర్షం మొదలైంది. దీంతో ఇద్దరు పనులను వదిలి చేను పక్కన ఉన్న గుడిసెలోకి వెళ్లారు. ఈక్రమంలో పెద్దశబ్దంతో కూడిన పిడుగు గుడిసెపై పడింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా చిట్టిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతుడు కృష్ణకు భార్య స్వరూప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాయపడిన చిట్టిబాబునుమెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే గండ్ర



సీఎం, డిప్యూటీ సీఎంకు పూల బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు లాభాల వాటా 34శాతం ప్రకటించడం పట్ల ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి లాభం మొత్తం రూ.2,360కోట్లు రాగా కార్మికుల వాటాగా రూ.919 కోట్లు పంచనున్నారని తెలిపారు. ఒక్కో కార్మికుడు సగటున రూ.1,95,610 అందుకోనున్నట్టు పేర్కొన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు సైతం బోనస్ కూడా ఇవ్వనుండటం హర్షదాయకమన్నారు.

క్రీడలతో పోటీతత్వం పెరుగుతుంది

స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమాశర్మ



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న ఏసీపీ భీమాశర్మ

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమాశర్మ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీవాణి గురుకుల విద్యాలయంలో ఇటీవల షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఏసీపీ చేతుల మీదుగా టీషర్టులను అసోసియేషన్ బాధ్యులు అందించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నెపు కుమార్, బాధ్యులు దేవ్‌సింగ్, యాదగిరి, సాంబన్న, మహాలక్ష్మి, రాజు, సుధాకర్, అజయ్, సాంబరాజు, నరేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లు వాడితే చర్యలు



డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేస్తున్న అధికారులు

జనగామ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డొమెస్టిక్ గ్యాసును హోటళ్ల వాడితే చర్యలు తప్పవని ఏసీఎస్‌వో ఇర్ఫాన్ హెహ్మద్ ఖాన్ హెచ్చరించారు. జనగామలోని హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లను సోమవారం సివిల్ సప్లై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ జనగామలో అక్రమంగా వాడుతున్న 13 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి వీరభ ద్ర గ్యాస్ ఏజెన్సీకి అప్ప గించామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర తినుబండరాలు షాపులలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ ఇట్టబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



గర్మిళ్లపల్లి శివారులో పట్టుబడిన రేషన్ బియ్యం

టేకుమట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి శివారులో సోమవారం స్థానిక పోలీసులు 35క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం జూకల్లు గ్రామానికి చెందిన మొలుగూరి గణేష్ గర్మిళ్లపల్లి శివారులోని పెట్రోల్‌బంకు వద్ద వాహనంలో అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో వాహనాన్ని తనిఖీ చేయగా 35క్వింటాళ్ల రేషన్‌బియ్యం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసి బాధ్యుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



తాడిచర్ల రైతు వేదిక వద్ద బారులు తీరిన రైతులు



చిట్యాలలో యూరియా కోసం క్యూకట్టిన రైతులు



కాటారం పీఏసీఎస్ గోడౌన్ వద్ద రైతులు

తప్పని యూరియా కష్టాలు

మల్హర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల పీఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఆది, సోమవారం రెండు రోజుల్లో 888 బస్తాలు రాగా వాటి కోసం క్యూ కట్టారు. ఉదయమే పీఏఎస్ కేంద్రం వద్దకు సుమారు 300 మంది రైతులు చేరుకున్నారు. ఈ నెల 12న యూరియా బస్తాల కోసం వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది రైతుల పేర్లు నమోదు చేసుకోగా ఆ లిస్టు ప్రకారం రైతులకు పంపిణీ చేశారు. ఇది సజావుగా సాగుతున్న క్రమంలో అధికారులు మల్లారం వ్యవసాయ శాఖకు సంబంధించిన వాట్సప్ గ్రూప్‌లో యూరియా బస్తాలకు తాడిచర్లకు రావాలని మేసేజ్ పెట్టారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. యూరియా బస్తాల కోసం పోటీపడ్డారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. అధికారుల తీరుపై తాడిచర్ల, మల్లారం రైతులు మండిపడ్డారు. ముందు తమకు ఇచ్చిన తర్వాతే మిగతా వారికి ఇవ్వాలని తాడిచర్ల రైతులకు పట్టుబట్టారు. దీంతో చేసేదేం లేక అధికారులు బస్తాల పంపిణీని కాసేపు నిలిపి వేశారు. అలాగే యూరియా బస్తాలతో పాటు నానో యూరియా అంటగట్టడంపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నానో యూరియా తీసుకుంటేనే యూరియా బస్తాలు ఇస్తామని అధికారులు అంటున్నారని పలువురు రైతులు ఆరోపించారు. బస్తాల పంపిణీ నిలిపి వేయడంతో రైతులు ఒక్కసారి గోదాం వైపు చొచ్చుకునే వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరగా అధికారులు మల్లారం రైతులకు హామీ ఇస్తూ మరో లోడ్ రానుందని, అదొచ్చాక అందులోని బస్తాలను పంపిణీ చేస్తామని సర్దిచెప్పారు. తాడిచర్ల రైతులకు యూరియా పంపిణీ చేయడంతో సమస్య సద్దుమణిగింది.

యూరియా దిగుమతి అయ్యిందని తెలిసి..

చిట్యాల (ఆంధ్రజ్యోతి): చిట్యాల, నైన్‌పాక గ్రామాల్లో ఎరువుల విక్రయ కేంద్రాల ఎదుట సోమవారం రైతులు బారులు తీరారు. యూరియా దిగుమతి అయ్యిందని సమాచారం తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే ఆయా కేంద్రాల వద్ద క్యూకట్టారు. స్థానిక ఎస్సై శ్రావణ్ కుమార్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

తరలి వచ్చిన వందలాది మంది రైతులు

కాటారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతులు యూరియా బస్తాల కోసం సోమవారం బారులు తీరారు. గారెపల్లి పీఏసీఎస్ గోడౌన్‌కు 770 యూరియా బస్తాలు రాగా ఉదయం నుంచే వందలాదిగా రైతులు గుమికూడారు. ఎస్సై-3 మానస ఆధ్వర్యంలో పోలీసులు దగ్గరుండి గొడవలు జరగకుండా నియంత్రించారు. పీఏసీఎస్ గోడౌన్‌ను జిల్లా వ్యవసాయాధికారి బాపురావు పరిశీలించి దగ్గరుండి ఏవో పూర్ణిమ, ఏఈవోలు రాజన్న, అస్మా, పీఏసీఎస్ సీఈవో సతీష్, సిబ్బందితో కూపన్లు రాయించి బస్తాలను పంపిణీ చేయించారు. గంగారం డీసీఎంఎస్ సెంటర్‌కు 220, గారెపల్లిలో ప్రైవేట్ డీలర్లకు 440 యూరియా బస్తాలు రాగా వాటిని సైతం ఏవో పూర్ణిమ రైతులకు పంపిణీ చేయించారు. యూరియా బస్తాల కోసం గంటల తరబడి వేచిచూశామని రైతులు ఆవేదన చెందారు. రెండు మూడు రోజుల్లో మరిన్ని ఎరువుల బస్తాలు అందుబాటులోకి రానున్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని డీఏవో బాపురావు రైతులకు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు భిక్షపతిగౌడ్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం బిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల నేపథ్యంలో నియోజకవర్గంలో ఇసుక దోపిడీ జరుగుతోందని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అవినీతికి తలొగ్గడం వల్ల ఎవరుపడితే వారు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగె రవి, రామస్వామి, మేకల ఓంకార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్హర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రమైన తాడిచర్లలో తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్లలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై-2 రాజన్, సిబ్బందితో పోలీసులు ఆ స్థావరంపై దాడి చేశారు. తాడిచర్లతో పాటు పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ 29,300, మూడు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



రేగొండ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

రేగొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో రైతులు సోమవారం రోడ్డెక్కారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద ఆదివారం అర్ధరాత్రి నుంచి క్యూ కట్టినా, గంటల కొద్దీ వేచి చూసినా ఒక్క బస్తా కూడా దొరక్కపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో 400 ఆధార్ కార్డులను టోకెన్ల కోసం సీరియల్‌లో పెట్టిన రైతులు తీరా యూరియా దొరక్కపోవడంతో తీవ్ర నిరసన తెలిపారు. మొత్తం రేగొండ సెంటర్‌కు 444 యూరియా బస్తాలు రాగా ఉదయం 8గంటల వరకు 700మంది వరకు రైతులు పీఏసీఎస్ వద్ద చేరుకున్నారు. దీంతో యూరియా బస్తాలు పంపిణీ పూర్తి కాగానే గోదాము మూసివేశారు. దీంతో యూరియా అందని రైతులు ఆగ్రహంతో పోలీస్ స్టేషన్ ఎదుట పరకాల-భూపాలపల్లి రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. యూరియా పంపిణీలో సరైన విధానాన్ని అవలంబించట్లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు. కృత్రిమ కొరతను సృష్టించి బస్తాలను స్టాక్ పెట్టుకుంటున్నారని ఆరోపించారు. రైతుల నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు మద్దతు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పలు కాలనీలు మురికినీటితో నిలిచి కంపుకొడుతున్నాయని అన్నారు. సిబ్బంది కొరత ఉండటంతో ఒక సమస్య అయితే.. ఉన్న వారికి సరైన రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని, బోనస్‌లు ఇవ్వాలని, పీఎఫ్, ఈపీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అనిల్, నాయకులు మంత్రి రాకేష్, అమృత అశోక్, రాజేందర్, జోగుల రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య రక్షణ



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్ పర్సన్ తిరుమల

కాటారం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో ఆరోగ్య రక్షణ సాధ్యమని కాటారం ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల, సీడీపీవో రాధిక అన్నారు. మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏఎంసీ చైర్‌పర్సన్, సీడీపీవో మాట్లాడుతూ పిల్లల తల్లులు, గర్భిణులకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణ, పరిసరాల్లో ఉన్న ఆకుకూరలు, పండ్లు తినాలని, దీంతో ఆరోగ్యరక్షణతో పాటు డబ్బులు ఆదా అవుతాయని అన్నారు. సీవియర్ అక్యూట్ మాల్ న్యూట్రిషన్ (స్యామ్), మోడరేట్ అక్యూట్ మాల్ న్యూట్రిషన్(మ్యామ్) ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టీహెచ్‌ఆర్ డబుల్ డోస్ ఇస్తున్నారని వెల్లడించారు. మహిళలు, యువతులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, ప్రమీల, దివ్య, రోజా, శ్రీలతారెడ్డి, ఏఎన్ఎం రజిత, ఆశా కార్యకర్తలు లక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

● బాలా త్రిపుర సుందరిగా శుభానందేవి

మహదేవపూర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర త్రివేణి సంగమం ఒడ్డునున్న కాళేశ్వరాలయంలో నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ ధర్మదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. బాలా త్రిపుర సుందరిగా శుభానందదేవి అమ్మవారిని, శైలపుత్రిగా సరస్వతి అమ్మవారిని అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రాతఃకాలంలో సుప్రభాతసేవతో అమ్మవారిని మేలుకొలిపారు. నవకలశస్నపం, సుగంధపరిమళ ద్రవ్యాలు, నవరసాలు, పంచామృతాలతో విశేష అభిషేకాలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.



బాలా త్రిపుర సుందరిగా శుభానందదేవి, శైలపుత్రిగా సరస్వతి అమ్మవార్లు

లంబాడీల జోలికొస్తే ఊరుకోం



పోలీసులు అరెస్టు చేసిన జేపీసీ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): లంబాడీల జోలికి వస్తే ఊరుకుకోమని లంబాడీ జేఏసీ జిల్లా కన్వీనర్ కొర్ర రాజేందర్ నాయక్ హెచ్చరించారు. లంబాడీల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునివ్వడంతో సోమవారం నాయకులను జనగామ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాజేందర్ మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కుట్రలు పనుతున్న సోయం బాబురావు, తెల్లం వెంకట్రావులను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో అజ్మీర స్వామి నాయక్, వాకుండోత్ అనిత, కనకరాజు, సురేశ్ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

నర్మెట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒక రోజు జైలు, వెయ్యి జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి వెంకటరాంనర్సయ్య కోర్టులో తీర్పు చెప్పినట్లు ఎస్సై ఎస్. నగేష్ తెలిపారు. తరిగొప్పుల మండలం అంకుషాపురం గ్రామానికి చెందిన బర్ల కార్తీక్ మద్యం సేవించి బండి నడుపుతూ ఈనెల 16న తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా ఒక రోజు జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఆఫ్ కోల్ నాగ్య

ఓసీని సందర్శించిన కోల్ డైరెక్టర్

మల్హర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : తాడిచర్లలోని జెన్‌కో ఓపెన్ కాస్టు ప్రాజెక్టును డైరెక్టర్ ఆఫ్ కోల్ సోమవారం సందర్శించారు. ఓసీలో పాటిస్తున్న రక్షణ చర్యలు, బొగ్గు ఉత్పత్తి తదితర అంశాలపై చర్చించారు. గత ఏడాది చేపట్టిన బొగ్గు ఉత్పత్తి, ఈ ఏడాది లక్ష్యాలు తదితర అంశాలపై చర్చించారు. డేంజర్ జోన్‌ను పరిశీలించి, కన్వేయర్ బెల్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. ఓసీకి సేఫ్టీ, స్టార్ రేటింగ్ అవార్డు రావడం పట్ల సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట ఏఎమ్మార్ సీఈవో డీఎల్‌ఆర్ ప్రసాద్, కేటీపీపీ సీఈ శ్రీప్రకాశ్, ఎస్ఈలు రామకృష్ణ, ముత్యాలరావు, జెన్‌కో జీఎం మోహన్‌రావు, ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్‌బాబు, డీజీఎం (సర్వే) సర్వోత్తమ్, డీజీఎం (మెకానికల్) కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ



యాదగిరిస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి

కొడకండ్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మొండ్రాయి గిర్నితండాలో బీఆర్ఎస్ కార్యకర్త రెండు రోజుల క్రితం మృతి చెందిన భూక్య మంగ్య కుటుంబాన్ని, జీబీతండా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుగులోతు భాష తండ్రి పంతులు మృతి చెందగా కొడుకును పరామర్శించారు. అనంతరం ఇదే గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాంజీ భార్య లక్ష్మిని పరామర్శించారు. కొడకండ్లలో శివరాత్రి సోమయ్య తండ్రి ఎల్లయ్యను పరామర్శించి, ఏడునుతూలలో చెన్నబోయిన రాములు, తోమాల యాదగిరి స్వామిలు ఇటీవలే మరణించగా, వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొడకండ్ల పార్టీ అధ్యక్షుడు రామోజీ రావు, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాములు, ఆసిఫ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మంగ్యా నాయక్, మాజీ సర్పంచ్లు రాజ్ కుమార్, మహేష్, గిర్ని తండ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7370	5300
మక్కలు	2151	1521
కందులు	5402	3022
పెసళ్లు	3852	3022
పల్లికాయ (సూక)	5900	3500
పల్లికాయ (పచ్చిది)	3320	2400
పసుపు (కాడి)	10259	7889
పసుపు (గోల)	9669	8996
తేజ మిర్చి	11500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలి

» వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య
» వేయిస్తంభాల ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు షురూ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శరన్నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ, ధ్వజారోహణం నిర్వహించి గణపతిపూజ, నవగ్రహారాధన, మండపారాధన, ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన, కలశస్థాపన, అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు జరిగే ఈ వేడుకలను వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అమ్మవారిని తొలి రోజు బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పం అనంతరం పులగం నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో గణపతి నవగ్రహ రుద్రసహిత సుదర్శన హోమాన్ని లోకకల్యాణం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ వారితో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.


రుద్రేశ్వరాలయంలో నవరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బతుకమ్మ విజేతలకు బహుమతులు

ప్రతియేటా మాదిరిగా రాధేశ్యామ్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పాటల పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి హనుమకొండ కాపువాడకు చెందిన దివ్య, ద్వితీయ బహుమతి మచిలీబజార్‌కు చెందిన జ్యోతి, తృతీయ బహుమతి కొత్తురుజెండాకు చెందిన సరోజనతోపాటు మరో 40 మందికి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎంపీ కావ్య ఈ సందర్భంగా చెప్పారు. కొంత మంది పురావస్తు శాఖ సిబ్బంది ఆలయంలో నవరాత్రి వేడుకలకు అడ్డంకులు కల్పించిన నేపథ్యంలో స్వయంగా పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ అనుమతితో వేడుకలు నిర్వహిం చుకుంటున్నామని చెప్పారు.

ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసారి దేవీ శరన్నవరాత్రి వేడుకలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ముఖ్య దాతలుగా వ్యవహ రిస్తుండటం విశేషం. గుడిమెల్ల విజయ కుమారాచార్యులు, సందీప్, కార్పొరేటర్ తోట వెంకన్న తదితరులు పాల్గొ న్నా రు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకురాలు కుండె అరుణ రాజ్‌కుమార్ శిష్య బృందంచే కూచిపూడి సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. అదే విధంగా హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన పద్మాక్షి ఆలయంలో భక్తుల కోలాహలం మధ్య సోమవారం నుంచి అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం అయ్యాయి. ఆలయ అనువంశీయ ధర్మకర్త నాగిళ్ల శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు షణ్ముఖ అవధాని నేతృత్వంలో పూజాదికాలు నిర్వహింపజేసి వేడుకలను ప్రారంభించారు.

స్థానిక ఎన్నికలు నిర్వహించే

దమ్ము సీఎంకు లేదు

- ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు
- వరంగల్ ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో రాష్ట్ర రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లతో కలిసి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని మేడారం పర్యటనకు వస్తున్న రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి మేడారంలో అడుగుపెట్టాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని రాష్ట్ర మంత్రులు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా ఆరు గ్యారంటీలు, రేవంత్‌రెడ్డి పాటలు వేసి బతుకమ్మలను అవమాన పర్చారని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 చోట్ల యూరియా కోసం క్యూలో నిలబడుతున్నారని, కాంగ్రెస్ వైఫల్యంతో యూరియా కొరత సృష్టిస్తున్నారని విమర్శించారు. లక్షా 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ప్రభుత్వం చెబుతుందని పది రోజులు గడిచిపోయిందని అదను తప్పిన తర్వాత యూరియా ఉపయోగం ఉండదని అన్నారు. మేడారం సమ్మక్క- సారలమ్మ సాక్షిగా రైతులకు ఇచ్చిన హామీలు రూ. 275 కోట్ల బోనస్ పెండింగ్‌లో ఉందని, రుణమాఫీ 46 శాతం మించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారని అన్నారు. రాబోయే మేడారం జాతరకు రామప్ప, లక్నవరం ప్రాజెక్టుపై సీఎం రివ్యూ చేసి స్పష్టమైన ప్రకటన చేయాలని జాతర వరకు గోదావరి జలాలు జంపన్న వాగు ద్వారా మేడారం జాతరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్‌ఎస్‌వీ నాయకుడు మాచర్ల శరత్‌చంద్ర, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ డెయిరీ సభ్యులకు దసరా బోనస్

23 వేల మంది సభ్యులకు లబ్ధి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ముల్కనూర్ మహిళా డెయిరీ సభ్యులకు రూ. 15.70కోట్ల బోనస్‌ను అందిస్తున్నట్లు డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్‌రెడ్డిలు వెల్లడించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార మహిళా డెయిరీలో సోమవారం వారు విలేకరు లతో మాట్లాడారు. ఈ సంవత్సరం 2.50కోట్ల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించామన్నారు. అప్పుడు రైతులకు వారి పాల నాణ్యతను బట్టి ప్రతి నెలలో బిల్లులు చెల్లించామన్నారు. ప్రస్తుతం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళా డెయిరీ సభ్యులకు రూ. 15.70 కోట్లు బోనస్‌గా చెల్లిస్తున్నామన్నారు. పాల అమ్మకాల్లో వచ్చిన లాభాల్లో నుంచి ఈ బోనస్‌ను అందిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ

రైతు పోసిన ప్రతి లీటర్ పాలకు రూ. 6.22 పైసలు బోనస్‌గా అందిస్తున్నామని తెలిపారు. డెయిరీ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాలోని 23వేల మహిళా డెయిరీ సభ్యులకు బోనస్ లబ్ధి చేకూరు తుందన్నారు. మంగళవారం నుంచి రైతుల ఖాతాల్లోకి డబ్బులను నేరుగా జమ చేస్తామన్నారు.

పత్తి దిగుమతులపై సుంకం కొనసాగించాలి

» పత్తి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
» హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

గిర్మాజీపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 11 శాతం సుంకాన్ని తిరిగి కొనసాగించాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం అబ్బనికుంటలోని తెలంగాణ రైతు భవనంలో రైతు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి పత్తి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. కేంద్ర ప్రభుత్వం పత్తిదిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తి వేయడంతో 60 లక్షల మంది పత్తి రైతు కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలు లేక పత్తి రైతులు అప్పుల పాలవుతున్నారని విమర్శించారు. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే మహరాష్ట్ర విదర్భ ప్రాంతంలో 767 మంది ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


రైతుల సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటనారాయణ మాట్లాడుతూ.. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం కొనసాగించేలా రైతాంగం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పత్తికి రు.12 వేలు మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రాష్ట్రంలో పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలుచేసిన వెంటనే రైతులకు డబ్బులు చెల్లించాలని తీర్మానం చేశారు. ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఎం.డి.హశాస్సేన్, సుధమల్ల భాస్కర్, వెంకన్న, నగేష్, పత్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

5వ పేజీ తరువాయి

మేడారానికి కొత్త రూపు

పగిడిద్ద రాజు, గోవిందరాజులు ఈ ఇరుకు ప్రాంగణంతోనే ఉండటంతో ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో మేడారం మాస్టర్ ప్లాన్‌లో గద్దెల ప్రాంగణం విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి ప్రాంగణ గోడల నుంచి అన్ని వైపులా 20 ఫీట్ల మేర విస్తరించాలని నిర్ణయించారు. దేవాదాయశాఖకు చెందిన 4 ఎకరాలు, ప్రభుత్వ భూమి 19 ఎకరాలు మొత్తం 23 ఎకరాల భూమిని సేకరించి గద్దెల ప్రాంగణం విస్తరణతో పాటు అతిథి గృహాలు నిర్మించాలనే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారు. దీంతో ప్రైవేటు, అసైన్డ్ భూముల సేకరణ పెద్దగా ఇబ్బంది ఉండదని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా భక్తులకు కూడా దర్శనం సులభం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే తల్లుల దర్శనానికి నాలుగు దిక్కుల ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రవేశ ద్వారాలతో లోపలికి వచ్చిన భక్తులు.. తల్లులను దర్శించుకుని బయటకు వెళ్లేందుకు నాలుగు ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో భక్తులు బయటకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

జంపన్నవాగులో నీటి నిల్వ

మేడారం జాతరలో జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించటం సంప్రదాయంగా వస్తోంది. జాతర సమయంలో లక్నవరం సరస్సు నుంచి విడుదల చేస్తారు. మేడారం పర్యాటక ప్రాంతంగా మారడంతో ప్రతిరోజూ భక్తులు వస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాలు, పండుగలు, ప్రత్యేక కార్యక్రమాలను కూడా మేడారంలో నిర్వహించుకునేందుకు భక్తులు వస్తున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేయడం సంప్రదాయం కావటంతో జాతరేతర రోజుల్లో నీళ్లు లేకపోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో జంపన్నవాగులో ఏడాదంతా నీటిని నిల్వ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జంపన్నవాగుపై రెండు, మూడు చోట్ల చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

2018 మహాజాతర సమయంలో అప్పటి ప్రభుత్వం జంపన్నవాగుపై నార్లాపూర్ చింతల క్రాస్ రోడ్డు, గుండ్లమడుగు, రెడ్డిగూడెం, ఊరట్టం వద్ద సుమారు రూ.16 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్‌లు నిర్మించారు. అయితే 2020 మహాజాతర నాటికి ఈ చెక్‌డ్యామ్‌లలో పడి సుమారు 15 మందికి పైగా భక్తులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలకు జంపన్నవాగులో నీరు ప్రవహించకుండా అడ్డుకట్ట వేయటమే కారణమని భక్తులు విశ్వసించారు. దీంతో నార్లాపూర్ చింతల క్రాస్ రోడ్డు వద్ద నిర్మించిన చెక్ డ్యామ్ మినహా మిగతా మూడు చెక్ డ్యామ్‌లను గత ప్రభుత్వం కూల్చేసింది. ఈ కూల్చివేతలకు రూ.2.30 కోట్ల వరకు ఖర్చు చేసింది. దీంతో కోట్లాది రుపాయల నిధులు నీళ్లపాలు చేశారనే విమర్శలను ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వం ఇలాంటి ఆలోచనే చేస్తుందనే టాక్ వినబడుతోంది. భక్తుల విశ్వాసాలకు భంగం కలుగకుండా జంపన్నవాగులో నిరంతరం నీళ్లు పారేలా ప్రణాళిక రూపొందించాలని కోరుతున్నారు.

నేడు సీఎం మేడారం పర్యటన

మహాజాతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు మేడారానికి ముఖ్యమంత్రి రావడం చరిత్రలో తొలిసారి. 2016లో అప్పటి ప్రభుత్వం మేడారం మహాజాతరకు రూ.150.50 కోట్ల నిధులు కేటాయించింది. కానీ, పనుల ప్రారంభానికి సీఎం హాజరు కాలేదు. ప్రస్తుత జాతరకు రూ.150కోట్లు కేటాయించటంతో పాటు ఆ పనులకు శంకుస్థాపన చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రావటంపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2026 జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులను కేటాయించింది.

2024 జాతరకు ప్రభుత్వం ఆలస్యంగా రూ.115కోట్ల నిధులు మంజూరు చేసింది. వీటిలో సుమారు రూ.25 కోట్ల పనులు అప్పట్లో జరగకపోవటంతో.. ఇటీవల ఆ నిధులతో మేడారంలో బీటీ రోడ్లతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అతిథి గృహాలను నిర్మిస్తున్నారు. ఈ అభివృద్ధి పనులను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం పర్యటనలో ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే గద్దెల కొత్త డిజైన్ పనులు, గద్దెల ప్రాంగణం విస్తరణ పనులను సీఎం ప్రారంభించనున్నారు. వీటితో ఐలాపూర్ వరకు రోడ్డు నిర్మాణం, జాతరలో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి సీతక్క మేడారంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పండుగ వేళ విషాదం

» బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో మహిళ మృతి
» మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కొత్తగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంగిలిపూల బతుకమ్మ రోజు అందరి ఇళ్లలో సంతోషాన్ని నింపితే.. ఓ కుటుంబంలో మాత్రం విషాదాన్ని నింపింది. ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో బతుకమ్మ ఆడేందుకు ఇంటి నుంచి ఆనందంతో వెళ్లిన మహి ళ శవంగా తిరిగివచ్చింది. అప్పటి వరకు అందరితో కలిసి బతుకమ్మ ఆడిన ఆమె మృతి చెందటంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది. బతుకమ్మ ఆటఆడుతూ ఒక్కసారి గుండెపోటు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన ఎంచగూడెంలో ఆదివారం రాత్రి జరిగింది. మృతురాలి కుటుం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ మండలంలోని ఎంచగూడెం గ్రామానికి చెందిన శెట్టి పరశురాం-మౌనిక (32) దంపతులకు కుమార్తెలు సాహితి, సాయిత్రి, కుమారుడు మన్విత్ ఉన్నారు. భర్త బ్యాం కుమిత్రగా పని చేస్తుండగా, భార్య మౌనిక ఎంచగూడెంలో జిరాక్స్ సెంటర్ నడుపు తోంది. ఆదివారం సాయంత్రం బతుకమ్మ ఆడేందుకు బతుకమ్మతో మహిళలతో కలిసి గ్రామంలోని బొడ్రాయి వద్ద చేరుకొంది. బతుకమ్మ ఆడుతూ ఒక్కసారిగా మౌనిక గుండెపోటు వచ్చి, పడిపోయింది. గమనించిన భర్త, కుటుంబసభ్యులు ఆమెను నర్సంపేట లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.


విషాదంలో భర్త, చిన్నారులు


శెట్టి మౌనిక (ఫైల్)


రాణిరుద్రమ నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కవులు, కళాకారులకు ఓరుగల్లు పెద్దపీట

» సంగీత నాటక ముగింపు వేడుకల్లో ఎంపీ కడియం కావ్య
» అలరించిన ప్రజా సాహిత్య కళారూపాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన కాకతీయ నృత్య కళారూపాల ముగింపు వేడుకలను ఎంపీ కడియం కావ్య జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ వరంగల్ అంటేనే కవులకు, కళాకారులకు అనాదిగా నిలయంగా బాసిల్లుతుందన్నారు. మహాకవి బొమ్మెర పోతన, పాల్కుర్కి సోమనాథుడు మొదలు కాళోజీ దాక అనేక మంది మహానుభావుల వారసత్వాన్ని స్వీకరించిన కవులు, రచయితలు నేరెళ్ల వేణుమాధవ్ లాంటి అగ్రశ్రేణి కళాకారులకు ఈ గడ్డ వేదికగా నిలిచిందన్నారు. ఇలాంటి ప్రదేశంలో సంగీత నాటక అకాడమి, రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహించిన ముదావహం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కవులకు, కళాకారులకు బాసటగా నిలుస్తుందన్నారు. వరంగల్‌ను సాంస్కృతిక కేంద్రంగా రూపొందించేందుకే కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

అలరించిన రాణిరుద్రమ

ఈ సందర్భంగా వరంగల్ డ్రమెటిక్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన రాణిరుద్రమ నృత్య రూపకం విశేషంగా అలరించింది. అలనాటి కాకతీయుల చరిత్రను కళ్ల ముందు నిలిపింది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని వీరత్వం రుద్రమదేవి పరాక్రమం ప్రేక్షకులచే కరతాళ ధ్వనులు కొట్టించింది. అదే విధంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొడుస్తున్న పొద్దుమీద లాంటి జనరంజక పాటలు ప్రజా కళాకారుల ప్రదర్శన వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమాల విజయవంతం నేపథ్యంలో ఇకనుంచి రాష్ట్రంలోని అన్ని పాత జిల్లా కేంద్రాల్లో సంగీత నాటక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అలేఖ్య పుంజాల ప్రకటించారు.

తాత్కాలిక బదిలీలపై గందరగోళం

» అనాలోచితంగా నిబంధనలు
» ఒకే జిల్లాలో కొనసాగుతున్నవారి సంగతేమిటి?
» సీనియారిటీ ప్రాతిపదికనే కేటాయించాలి
» నష్టపోయిన వారికి తాత్కాలిక బదిలీల్లో అవకాశం కల్పించాలి
» బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్

హనుమకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల తాత్కాలిక బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 190పట్ల కొందరు ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో ఊరట వ్యక్తం అవుతుండగా జీవో 317 బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగులు మాత్రం నిరసిస్తున్నారు. జీవో 190 అసంబద్ధ, అనాలోచితమైనదిగా అభివర్ణిస్తున్నారు. ఇతర జిల్లాలు, జోన్లకు బదిలీ అయి ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం కల్పించేలా మంత్రి వర్గం ఉప సంఘం చేసిన సిఫారసు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. జీవో 317 ద్వారా ఒక జోన్ నుంచి మరో జోన్‌కు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీ అయిన వారికి న్యాయం జరిగేలా జారీ చేసిన జీవో 190 కొంత మంది ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మాత్రమే లాభం జరిగేలా ఉందన్న అసంతృప్తి జీవో 317 బాధిత ఉపాధ్యాయ, ఉద్యోగుల్లోనూ వ్యక్తం అవుతోంది. జీవో 317లో సీనియారిటీ ప్రాతిపదికగా జిల్లాల కేటాయింపు జరిగినందువల్ల పలువురు ఉద్యోగులు వారు సుదీర్ఘకాలంగా పని చేస్తున్న జిల్లాలోనే తిరిగి కొనసాగే పరిస్థితి ఏర్పడింది. వారి సంగతి ఏమిటని ఉద్యోగ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

సీనియారిటీ ప్రాతిపదికనే బదిలీలు చేయాలి

జీవో 317లో సీనియారిటీ ప్రాతిపదికన జిల్లాల కేటాయింపు జరిగినందువల్ల మళ్లీ అదే విధంగా ఇప్పుడు ఇచ్చిన తాత్కాలిక బదిలీలను కూడా సీనియారిటీ ప్రాతిపదికనే ఇవ్వాలని 317 జీవో బాధిత ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మ్యూచువల్ బదిలీలను జీవో నెంబర్ 21 ద్వారా చేపట్టారు. ఆ తర్వాత మళ్లీ జీవో 243 ద్వారా మెడికల్ గ్రౌండ్, జీవో 244 ద్వారా స్పౌజ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులను వారి వారి జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో జీవో 317కి ముందు ఎస్‌జీటీగా ఉన్న ఉపాధ్యాయులను ఈ జీవో తర్వాత పదోన్నతిపొందగా వారిని స్పౌజ్ ఉన్న జిల్లాలకు కేటాయించారు. ఇది జీవో 317కు విరుద్ధమని చెబుతున్నారు. ఎందుకంటే జీవో 317లో ఒక జిల్లాను కేటాయించిన తర్వాత పదోన్నతి పొందినవారు స్పౌజ్‌లో ఇంకో జిల్లాకు వెళ్లడం అంటే అ వ్యక్తికి జీవో 317 వర్తించనట్టేనంటున్నారు. మళ్లీ మ్యూచువల్ బదిలీలకు సంబంధించి జీవో 245 ద్వారా చేపట్టిన బదిలీల్లో కూడా జీవో 317కు ముందు ఒక క్యాడర్‌లో ఉండి తర్వాత పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు కూడా మ్యూచువల్ బదిలీలో అవకాశం కల్పించారని, ఇది కూడా జీవో 317కు వ్యతిరేకమని అంటున్నారు. జీవో 317 ద్వారా జిల్లాలు కేటాయించినప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా పాటించి జిల్లాలను కేటాయించారు. కానీ పరస్పర బదిలీల్లో, స్పౌజ్ బదిలీల్లో మొదట కేటాయించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించపోవడం మరొక అన్యాయమేనని వాపోతున్నారు.



190 అసంబద్ధ జీవో

ఇక ఇప్పుడు జీవో 317 బాధితుల ఉపశమనం కోసం ప్రభుత్వం తాత్కాలిక బదిలీల కోసం జారీ అయిన జీవో 190లో జీవోలు 243, 244, 245, 21 జీవోలలో లబ్ధిపొందిన వారికి అవకాశం లేదన్నది స్పష్టం. ఇంత వరకు బాగానే ఉన్నా జీవో 317కు ముందు ఒక జిల్లా జీవో 317 తర్వాత ఒక జిల్లా ఉన్నవారికి మాత్రమే ఈ జీవోలో అవకాశం కల్పించారు. కానీ జీవో 317కు ముందు ఆ తర్వాత ఒకే జిల్లాలో పని చేసున్నవాళ్లకు అవకాశం లేదని ఈ జీవోలో పేర్కొన్నారు. అయితే ఇక్కడ జీవో 317కు ముందు, తర్వాత ఒకే జిల్లా కేటాయించబడిన వాళ్లు అప్షన్స్ ఇచ్చే క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లానే తీసుకుంటే ఆరు జిల్లాలుగా విభజన జరిగిందని, ఈ జీవో 317 వల్ల ఒక ఉద్యోగి ఆరు ఆప్షన్లు ఇవ్వాల్సి వచ్చిందని, దానిలో మొదటి ఆప్షన్‌గా ఒక జిల్లా రెండో ఆప్షన్‌గా ఇంకో జిల్లా ఇలా ఆరు ఆప్షన్లు ఇచ్చినప్పుడు అందులో మొదటి ఆప్షన్ కాకుండా మిగతా ఆప్షన్లు ఇచ్చిన జిల్లాకు కేటాయించడిన ఆ ఉపాధ్యాయులు, ఉద్యోగులు జీవో 317 బాధితుడే అవుడాని అంటున్నారు.

ఈ క్రమంలో జీవో 317కి ముందు పని చేసిన జిల్లాను కేటాయించినా అతడు కచ్చితంగా జీవో 317 జీవో బాధితుడే అవుతాడని పేర్కొంటున్నారు. కానీ వారు జిల్లా స్థానికులు కారు. ఆ జిల్లాలో చదవలేదు. అప్పుడున్న పరిస్థితుల్లో వారికి 20 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికీ బదిలీలలో ఎప్పటికీ ఆ జిల్లాలోని పాఠశాలల్లోనే కేటాయించారు. దానికి వారిని బాధ్యుల్ని చేస్తూ ఇలా అసంబద్ధ, అనాలోచిత జీవో జారీ చేయడం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి తీవ్ర నష్టం జరగడమే కాకుండా అనేక కొత్త సమస్యలకు దారి తీస్తుందని అభిప్రాయపడుతున్నారు. కనుక ప్రభుత్వం స్పందించి జీవో 317లో సీనియారిటీ ఆధారంగా కేటాయించినట్లే జీవో 190ద్వారా కూడా 317వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు గతంలో కేటాయించినప్పటి జాబితా ఆదారంగానే తాత్కాలిక బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

జిల్లాలు మారిన వారికే మళ్లీ అవకాశం

2024లో జరిగిన బదిలీల్లో జీవో 317కు ముందు ఒక జిల్లా జీవో 317 తర్వాత మరో జిల్లా కేటాయించబడిన ఉపాధ్యాయులలో గతంలో పని చేసిన జిల్లా పాఠశాల పాయింట్లతో బదిలీల్లో లబ్ధి పొంది ప్రస్తుతం పని చేస్తున్న జిల్లాల్లో దగ్గరి ప్రాంతం, రవాణా సౌకర్యం ఉన్న పాఠశాలలకు బదిలీ అయ్యారు. మరి ఇలా బదిలీల్లో జీవో 317కు ముంద తర్వాత ఒకే జిల్లాలో ఒకే పాఠశాలలో పని చేసిన వారికి వర్తించిన పాయింట్లను జీవో 317కి ముందు ఒక జిల్లా ఆ తర్వాత ఒక జిల్లా కేటాయించబడిన వారికి కూడా ఒకే రకమైన విధానాన్ని అనుసరించిన ప్రభుత్వం ఇప్పుడేమో జీవో 190 ద్వారా జిల్లాలను మారిన వారికే అవకాశం కల్పించడం శోచనీయమని అంటున్నారు.

ఆడబిడ్డను ఎదగనిద్దాం

మంత్రి ధనసరి సీతక్క

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆడబిడ్డలు ఆరోగ్యపరంగానూ ఆర్థికంగానూ ఎదిగి తమ కాళ్లపై తాము నిలబడేలానేలా తీర్చిదిద్దిన తర్వాతే పెళ్లి చేయడం తల్లిదండ్రుల బాధ్యతని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బాల్య వివాహాలను జరిపించి వారి బంగారు భవిష్యత్తును కష్టాల పాలు చేయొద్దన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంత్రి సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేయడం వల్ల వారికి అనేక ఇబ్బందులు ఎదురవు తాయన్నారు. పెళ్లి చేస్తే తమ బాధ్యత తీరినట్లు భావించడం తల్లిదండ్రులు మానుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాల్య వివాహాలపై సంపూర్ణ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పోషణమాసం కార్యక్రమంలో ప్రతి అంశంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రేగ కల్యాణి, తహసీల్దార్ జగదీశ్వర్, కాంగ్రెస్ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, అఫ్సర్‌ఖాన్, వావిలాల చిన్న ఎల్లయ్య, కరం చందు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరిస్తా

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి సీతక్క అన్నారు. ఐటీడీఏలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసి ఆమెకు దినసరి వేతన కార్మికులు, సీఐటీయూ నాయకులు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శితో మాట్లాడారు. జీవో 64నకు సంబంధించిన విషయం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. సమ్మెను విరమించాలని, పెండింగ్ వేతనాలను రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తామని మంత్రి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దావూద్, రత్నం రాజేందర్ పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

మంగపేట మండలంలో మంత్రి విస్తృత పర్యటన

మంగపేట (ఆంధ్రజ్యోతి) మంత్రి ధనసరి సీతక్క మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. కమలాపురంలోని ఎర్రవాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు చేరి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. వాగులో ఉన్న చెట్లను శాశ్వతంగా తొలగించి ఇక నుంచి వరదలు రాకుండా చెట్లను తొలగించిన పనులను పరిశీలించారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయం ఆవరణలో బాధితులకు దుప్పట్లు, దుస్తులు, ఇతర సరుకులను అందజేశారు. అనంతరం గంపోనిగూడెం, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో మంత్రి సీతక్క పర్యటించారు. రాజుపేటలో కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి కర్రి నాగేంద్రబాబు తండ్రి ఇటీవ మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

మండల అభివృద్ధికి కృషి

జిల్లాలో చిట్టచివరగా ఉన్న మంగపేట మండలంలో ప్రతి ఏటా వాన కాలం వస్తే గోదావరి వరదలతో ప్రజలు సతమతమతుతున్నారని, ప్రత్యేక చర్యలను చేపట్టి ప్రత్యేక ప్రణాళికను రూపొందించామని మంత్రి సీతక్క ప్రకటించారు. కమలాపురంలోని సీతారామాచంద్ర స్వామి దేవాలయం నుంచి సంత వరకు రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. వచ్చే గోదావరి పుష్కరాల వరకు అన్ని గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పుష్కర ఘాట్ల నిర్మాణంతో పాటు చుట్టు పక్క దేవాలయాలైన శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పేరుఉకపోయిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గుట్టపై దైవ దర్శనాలకు ప్రత్యేక లిఫ్టులను ఏర్పాటు చేసి దర్శనం సులువుగా కలిగేందుకు చర్యలు చేపడతానన్నారు. భక్తులు విడిది చేందుకు పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. చింతామణి జలధారల వద్ద దుస్తులు మార్చుకొనేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తామన్నారు. మంగపేట, కమలాపురంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌తో పాటు డబుల్‌రోడ్డు పనులు అన్ని గోదావరి పుష్కరాల వరకు పూర్తవుతాయని తెలిపారు.



కమలాపురంలో దుప్పట్లు అందిస్తున్న మంత్రి సీతక్క

ముఖ్యమంత్రి పర్యటనకు భారీగా తరలిరావాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మేడారం పర్యటించనుండగా ఈ కార్యక్రమానికి భారీగా తరలి రావాలని మంత్రి సీతక్క కోరారు. ఏ ముఖ్యమంత్రి కూడా మేడారం ఇంతముందు వచ్చిన దాఖాలాలు లేవన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం జాతరకు మూడు నెలల ముందే రావడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు పలువురు హాజరవుతున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేసి మేడారం జాతరకు పేరు తీసుకురావాలని ప్రజలను కోరారు. మంత్రి సీతక్క వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా అనుబంధ సంఘాల బాధ్యులు పెద్ది నర్సింహారావు, భగవాన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మైల జయరామిరెడ్డి, కారుపోతుల నర్సయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, మంగపేట మాజీ ఎంపీపీ పచ్చ శేషగిరిరావు, మంగపేట మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, సీనియర్ నాయకులు చింతా పున్నారావు, నిమ్మల రాంబాబు, బట్టరుశెట్టి గౌతంకుమార్, చింతా సురేష్ పాల్గొన్నారు.

రామప్ప ఆలయాన్ని సందర్శించిన అమెరికన్లు



దేవాలయం ఆవరణలో అమెరికన్లు

వెంకటాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని అమెరికా దేశానికి చెందిన ఎమిలీ, అన్నా, జాక్, రిచర్డ్, మార్గరెట్ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమెరికన్లు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గర్భగుడికి తూర్పున ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడి నుంచి రామప్ప సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వారి వెంట సౌత్ ఇండియన్ గైడ్ రాజేంద్ర, స్టేట్‌గైడ్ మధు, రామప్ప టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పవన్

ములుగు రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సర్పంచుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు భూక్యా పవన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మూడేళ్లుగా కలెక్టర్లు, పంచాయతీ అధికారులు సర్పంచుల చేత పనులు చేయించినా ఇంకా బిల్లులు చెల్లించలేదని తెలిపారు. సర్పంచుల మెడపై కత్తి పెట్టి పారిశుధ్య నిర్వహణ, డ్రైయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలు, పల్లె ప్రకృతి వనాలు లాంటి పనులు చేయించారని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించమని అధికారులకు పలుమార్లు కోరినా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని చేతులెత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రమేష్

వెంకటాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటాలని సీఐ ముత్యం రమేష్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కాఫేడ్ స్వచ్ఛంద సేవాసంస్థ క్రీడా మైదానంలో డివిజన్ స్థాయి వెంకటాపురం ప్రీమియర్‌లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి, వ్యక్తిగత సామర్థ్యాన్ని వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.55,555, రెండో బహుమతి రూ.38,333, మూడో బహుమతి రూ.32,222, నాలుగో బహుమతి రూ.11,111తోపాటు షీల్డ్‌లను అందజేయన్నుట్టు పోటీల నిర్వాహకులు తెలిపారు. అనంతరం పోలీస్ టీం, ప్రెస్ టీం ఫ్రెండ్లీమ్యాచ్ ఆడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ చిడెం మోహన్‌రావు, నాయకులు పీర్ల కృష్ణబాబు, బాలసాని అశ్వపతి, ఎస్సై కొప్పుల తిరుపతిరావు, పీఎస్సై తిరుపతిరెడ్డి, గొంది హనుమంతుతోపాటు వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, మంగపేట మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదిర ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా నియామకం కోసం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జీవీఈ.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్, ఆయాకు ఏడో తరగతి పాసైనవారు ఈనెల 23లోగా దరఖాస్తులను స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

బతుకమ్మకు నిధులు విడుదల చేయాలి : బీఆర్ఎస్

ములుగు టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్యా జంపన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్యదర్శులు అప్పులు తెచ్చి పంచాయతీలను నడిపిస్తున్న నేపథ్యంలో పండుగ ఏర్పాట్ల కోసం నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక గౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

కాంగ్రెస్ నాయకులే ఇసుక అక్రమార్కులు : బీఆర్ఎస్

టేకుమట్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులే ఇసుక అక్రమార్కులని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని విమర్శించే అర్హత స్థానిక కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. భూములు ఆక్రమించుకున్నారని మాట్లాడే కాంగ్రెస్ నాయకులు నిరూపించి చూపాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నాళ్లు టేకుమట్ల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టామన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన నాటి నుంచి అక్రమ ఇసుక రవాణాకు హద్దు లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మాజీ ఎంపీపీ మల్లారెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రజిత

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భూపాలపల్లి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత అన్నారు. పట్టణంలోని హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో హనుమాన్‌నగర్ 1, 2లతో పాటు శాంతినగర్ సెంటర్ల అంగన్‌వాడీ టీచర్లు బండారి పుష్పలత, ఆర్.పద్మ, లక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం సోమవారం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా సూపర్‌వైజర్ రజిత హాజరై తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం గురించి వివరించారు. ఏయే కూరగాయలు, చిరుధాన్యాలు తినాలో వివరించారు. పుట్టిన వెంటనే గంటలోపు పిల్లలకు ముర్రిపాలు తాగిస్తే పిల్లలు బలంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా టీచర్లు చిరుధాన్యాలు, కూరగాయలతో వేసిన చిత్రాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆయాలు శారద, మహాలక్ష్మి, రజిని, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మంగళపల్లి శ్రీనివాస్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో నిర్వాహకులు ఆకుల రమేష్ సోమవారం తెలిపారు. శ్రీనివాస్ 30 ఏళ్లుగా అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ మండలంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో కీలకం పాత్ర పోషించారన్నారు.

క్రీడాకారులకు కాంగ్రెస్ నేతల చేయూత

కాటారం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించే గారెపల్లి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నీలో పాల్గొనే పలు జట్ల క్రీడాకారులకు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు చేయూతనందించారు. స్వయంకృషి-11 జట్టు క్రీడాకారులకు సోమవారం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నేత కడారి విక్రమ్ టీషర్ట్స్ అందించారు. ధన్వాడకు చెందిన డీఎస్‌బీ టీం సభ్యులకు కాంగ్రెస్ నేత భూపెల్లి రాజు టీ షర్ట్స్ అందించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు, క్రీడాకారులు కుమార్, సతీష్, సుమన్, నిజాం, వినయ్, ప్రవీణ్, వేదాంత్, జుబేర్, శ్రావణ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'నన్ను ఓ అధికారి వేధిస్తున్నాడు'

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నతప్పిదానికే తనను ఓ అధికారి వేధిస్తున్నారని సింగరేణి వాల్వ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మదన్‌మోహన్ ఆవేదన వ్యక్తం చేశాడు. కొంతకాలంగా రామప్ప కాలనీలో నీటిని సరఫరా చేస్తున్న క్రమంలో ఓ రోజు కడుపునొప్పి రావడంతో ఆకస్మికంగా ఆస్పత్రికి వెళ్లానన్నాడు. త్వరగా వస్తానని అనుకుని వెళ్లినప్పటికీ కొంత ఆలస్యం కావడంతో ట్యాంక్‌లోని నీరు బయటికి వెళ్లిపోయినట్లు అధికారులకు సమాచారం అందిందని తెలిపాడు. దీంతో విచారణ జరపకుండానే తనపై ఓ అధికారి మానసికంగా వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

ఎస్పీని కలిసిన రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు

మల్హర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఎస్పీ కిరణ్ ఖరేను సోమవారం ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 24న జిల్లా కేంద్రంలో జరిగే సన్మాన కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఆయన వెంట కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కడారి విక్రమ్, ఆత్మకూరి కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాయలంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి జ్యోతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని కోరుకున్నామని వారు తెలిపారు.

- మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- కాటారం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గారెపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, ఎర్రగుంటపల్లిలో, లక్ష్మీదేవర ఆలయం వద్ద, ధన్వాడ దత్తాత్రేయస్వామి ఆలయం, గూడూరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు శ్రీరాంభట్ల కృష్ణమోహన్, మాడుగుల నాగరాజు, వేదాంతం గణేష్ అమ్మవార్లకు వివిధ రకాల పూజల అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై నెలకొల్పిగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు మద్ది నవీన్, నిర్వాహకులు రమేష్, నందకిషోర్, రవీందర్, మనోహర్, శ్రీనివాస్, సూరిబాబు, అంజయ్య, మూర్తి, సదాశివ్, చంద్రమౌళి, మహేష్, మనోహర్, ప్రకాష్, కిరణ్, రమేష్‌భాస్కర్, నగేష్, రాజబాపు, ప్రవీణ్, నాగేశ్వర్, రమణయ్య, తిరుమలేష్, శ్రీనివాస్, శ్రీమన్ పాల్గొన్నారు.



భూపాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతుల పూజలు

- వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీశరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడగూడెం, పాత్రాపురం, ఆలుబాక, వెంకటాపురం మండలకేంద్రంలోని పాతమార్కెట్ సెంటర్, శివాపురంవీధి, రజకవీధి, వేపచెట్టు సెంటర్, దుర్గమ్మగుడి సెంటర్‌లలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి.
- మంగపేట, సెప్టెంబరు : మండలంలోని కమలాపురం సీతారామాచంద్ర స్వామి, మంగపేటలోని ఉమాచంద్ర శేఖరస్వామి దేవస్థానం, బోరునర్సాపురంలోని సీతా రామాంజనేయ స్వామి దేవాలయం, తిమ్మంపేటలోని అంబేద్కర్ సెంటర్‌లో, మల్లూరులో శంభులింగేశ్వర స్వామి, రాజుపేటలోని వేణుగోపాలస్వామి, రమణక్కపే టలో రామాలయం ఆవరణంలో దేవీ శరన్నరాత్రి ఉత్స వాలు ప్రారంభమయ్యాయి. మంగపేటలో సామూహిక కుంకుమార్చన, కమలాపురంలో మహా అన్నదానం కార్యక్రమాలను ఉత్సవ కమిటీలు నిర్వహించాయి.

వారాహీ లక్ష్మీమాతా ఆలయంలో చండీహోమం

రేగొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వారాహీ లక్ష్మీమాతా ఆలయంలో సోమవారం దాసరి వేణు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని వైభవంగా అలంకరించారు. హోమగుండానికి ముగ్గులు వేసి పూలతో అలంకరించారు. అనంతరం ఉపాసకుల మంత్రోచ్ఛరణాలు, వాయిద్యాల మధ్య హోమం నిర్వహించగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నవరాత్రి ఉత్స వాల ప్రారంభ రోజు కావడంతో మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు భవానీమాత దీక్ష తీసుకున్నారు. అనంతరం చండీ హోమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చండీయాగంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పున్నం రవి, మైన బిక్షపతి పాల్గొన్నారు



చండీహోమం చేస్తున్న భవానీ మాలధారులు

దంచి కొట్టిన వాన

మల్లంపల్లిలో 9.93 సెం.మీ వర్షపాతం

ములుగు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో సోమవారం సాయం త్రం వర్షం దంచి కొట్టింది. జేడీ మల్లంపల్లి మండలంలో 9.93 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతవరణ శాఖ అధికారులు వెల్లడించారు. ములుగు మండలంలో 4.20 సెం.మీ, వెంకటాపురం 2.60 సెం.మీ, కన్నాయిగూడెం 2.10 సెం.మీ, వెంకటాపూర్ 1.35 సెం.మీ, గోవిందరావుపేట 0.60 సెం.మీ, ఏటూరునాగారం 0.25 సెం.మీ, తాడ్వాయి 0.23 సెం.మీ, వాజేడు మండలంలో అత్యల్పంగా 0.10 సెం.మీల వర్షపాతం రికార్డు అయ్యింది.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహాముత్తారం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలం రెడ్డిపల్లి, కనుకునూర్, సింగంపల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. 50 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, 2400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 8 కేసులు నమోదు చేసి ఆరుగు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో కాటారం ఎక్సైజ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజసమ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎన్. రజిత పాల్గొన్నారు.

భారీ వృక్షానికి నిప్పు

చిట్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాల ఆవరణలోని పురాతన వేప చెట్టుకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరారు. మంటలు ఆర్పేందుకు కష్టపడ్డారు. పాఠశాల మోటార్ పైపుతో నిప్పును ఆర్పిన అదుపులోకి రాకపోవడంతో చెల్పూరు ఫైరింజన్‌ను రప్పించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది భారీ వృక్షం లోపల అంటుకున్న నిప్పును పూర్తిగా చల్లార్చారు. కాగా చెట్టు లోపల సుమారు 8 ఫీట్ల వరకు మంటలు వ్యాపించడంతో చెట్టు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దసరా సెలవుల అనంతరం విద్యార్థులు పాఠశాలకు వచ్చేలోపు చెట్టును తొలగించాలని, లేదంటే ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ప్రజావాణి వినతులపై సత్వరమే స్పందించాలి

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను జవాబుదారీతనంతో తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యమనే దృష్టితో వినతులను పరిశీలించి న్యాయం చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి సమాధానం ఇవ్వాలన్నారు. ప్రజావాణిలో 42 వినతులతు వచ్చాయి.

యూరియా కోసం పడిగాపులు



యూరియా కోసం బారులు తీరిన రైతులు

గణపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం మండల రైతులు పడిగాపులు కాస్తున్నారు. యూరియా లారీ వస్తుందంటే చాలు తెల్లవారుజాము నుంచే సొసైటీ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సోమవారం గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద తెల్లవారక ముందే క్యూకట్టారు. సుమారు 880 యూరియా బస్తాల పంపిణీ జరిగింది.. మరో 300 మంది ఆధార్ వివరాలను ముందే సేకరించామని, మరో రెండు రోజుల్లో మిగతా రైతులకు కూడా బస్తాలు పంపిణీ చేస్తామని పీఏసీఎస్ సిబ్బంది తెలిపారు.